క్లుప్తంగా

ప్రతిభను వెలికి తీసేందుకే వేసవి శిబిరాలు

దామెర : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లకావత్ రాజేశ్ కుమార్ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సోమవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని అన్నారు. చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్, క్యారమ్స్, డాన్స్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

11 నుంచి 14 వరకు ప్రతిష్ఠాపన మహోత్సవాలు

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి శిఖర జీర్ణోద్ధారణ కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాసాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న నృసింహస్వామి జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, కల్యాణమహోత్సవం, విశ్వక్సేన పూజ, అంకురార్పణ, సుదర్శన కలశ గ్రామ శోభాయాత్ర నిర్వహిస్తామని అన్నారు. 12న పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, యాగశాల ప్రవేశం, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ, పంచపల్లవ సహిత జలాధివాసం కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. 13న మంటపార్చన, హోమములు, మహాస్నపన విధి, ప్రసాదస్నపన విధి, ధాన్యాదివాసము, శయ్యాదివాసము, పుష్పాదివాసము నిర్వహిస్తామన్నారు. 14న రత్నన్యాసము, దాతున్యాసము, బీజన్యాసము, అనురాధా నక్షత్రయుక్త మిధున లగ్న సుమూహూర్తమున ఉదయం 9.09 నిమిషాలకు పంచలోహ సహిత శ్రీ సుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలోని వ్యవసాయ బావుల వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్ సోమవారం తెలిపారు. చిల్పూర్‌గుట్టకు చెందిన వైద శ్రీను, బానాల నాగరాజు, పీచర గ్రామానికి చెందిన పోలు తిరుపతి, పెద్ది నగేష్, ధర్మసాగర్‌కు చెందిన ముప్పారపు దుర్గారాజు, ముప్పారపు కోటేశ్వర్, రాజవరం కన్నెబోయిన శ్రీశైలంలు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.71,770ల నగదు, 8 సెల్‌ఫోన్లు,1 బ్రేజా కారు, 2 ద్విచక్రవాహనాలు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



వేలేరు : దేశ రక్షణలో తనవంతుగా సేవలందించి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసి తన సొంత గ్రామమైన ఎర్రబెల్లికి వచ్చిన ఆర్మీ జవాన్ గొర్రె నరేశ్ కుమార్‌కు సోమవారం గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆయన గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్తులు ఆయన ఇంటి వరకు కోలాటాలతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నబాబు, రాజ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ సతీష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వరుణ్‌కుమార్, స్నేహితులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



శాయంపేట : రక్తదానం ప్రాణదానంతో సమానమని జాగృతి యువత మండల నాయకుడు మూల మనోహర్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన జాగృతి యువత రాష్ట్ర నాయకుడు, సామాజిక సేవకుడు అమ్మ అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం పరకాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 15 మంది జాగృతి యువత నాయకులు రక్తదానం చేశారు. అమ్మ అశోక్ నిరుపేద కుటుంబాలకు ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. శ్రీనివాస్, కుమారస్వామి, రాజు, తిరుపతి రెడ్డి, విజేందర్, నితీష్, రాజు పాల్గొన్నారు.

కలగా మారిన సైన్స్ గ్రూపులు

- కళాశాలకు 16 ఏళ్లు పూర్తి
- ఆర్ట్స్‌గ్రూపులో రాష్ట్ర స్థాయి ఫలితాలు
- సైన్స్ గ్రూపులు లేక పేదల ఇబ్బందులు



ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆత్మకూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ చదవాలనే విద్యార్థుల ఆశలు ఇక్కడ అడియాసలవుతున్నాయి. చదవాలనే కుతూహలం, ప్రతిభ ఉన్నా అవకాశాలు లేక హనుమకొండకు వెళ్లలేక ఆర్ట్స్ గ్రూపులకే పరిమితమవుతున్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులు లేక పేద తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మారుతున్న పరిస్థితుల్లో విద్యార్థులు సైన్స్ గ్రూపుల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే దీనికి భిన్నంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే ఉండడంతో విద్యార్థులు సైన్స్ విద్యకు దూరం అవుతున్నారు. డాక్టర్ కావాలనే లక్ష్యం ఉన్న విద్యార్థులు బైపీసీ, ఇంజనీర్ లక్ష్యం ఉన్న విద్యార్థులు ఎంపీసీ గ్రూపును ఎంచుకుంటారు. అయితే ఈ లక్ష్యం స్థానిక పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. సైన్స్ గ్రూపులు లేకపోవడంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల బాలబాలికలు చదువుకు దూరమవుతున్నారు. బాలురు వ్యయప్రయాసలకు ఓర్చి నగరానికి వెళుతున్నా, బాలికలను తల్లిదండ్రులు దూరం పంపించకపోవడంతో పదో తరగతితోనే చదువు ఆపేస్తున్నారు. కళాశాల దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2009లో ప్రారంభమైంది. ఆ తర్వాత అధునాతన పక్కా గదులతో నూతన భవనంలోకి 2018లో మారింది. పక్కా వసతులతో భవనం ఉన్నప్పటికి సైన్స్‌గ్రూపులు లేకపోవడంతో కళాశాల కల తప్పుతున్నది. విద్యపై మక్కువ ఉండి అంకితభావం కలిగిన ప్రిన్సిపాల్ బీ.ఎస్.రెడ్డి పర్యవేక్షణలోవిద్యార్థులు సీఈసీ గ్రూపులో ప్రతి ఏటా రాష్ట్ర, జిల్లాస్థాయి మార్కులు సాధించి పలువురి ప్రశంసలు పొందుతున్నారు.ఇప్పటికైనా కళాశాలలో సైన్స్ గ్రూపులతో పాటు, ఒకేషనల్ గ్రూపులు మంజూరు చేయాలని ఈ దిశగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలి



కళాశాలలో సైన్స్ గ్రూపులు లేకపోవడంతో విద్యార్థులను కళాశాలకు పంపించలేక పోతున్నాం. ఆడపిల్లలను సిటీకి పంపించడానికి భయపడుతున్నారు. – పొగాకుల సంతోష్

ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి



కళాశాల ప్రారంభించి 16 ఏళ్లు అవుతున్నది. ఇప్పటివరకు సైన్స్ గ్రూపులకు మోక్షం లేదు. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలి. – ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి

ఉన్నతాధికారులకు తెలియజేశాను



సైన్స్,ఒకేషనల్ గ్రూపులు మంజూరు చేయాలని గతంలోనే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాను. – బీఎస్.రెడ్డి, ప్రిన్సిపాల్

పంటకు అధిక యూరియా హానికరం

- శాస్త్రవేత్త సంతోష్ కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ సంతోష్‌కుమార్

ధర్మసాగర్ : రైతులు పంటలకు యూరియా అధికంగా వేయడంతో నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జి.సంతోష్ కుమార్ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సోమదేవరపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో యూరియాను ప్రతి పంటకు శాస్త్రీయంగా సూచించిన మోతాదులోనే వేసుకోవాలన్నారు. అధిక యూ రియా వేయడంతో పంటకాలం పెరగడం, పురుగులు అధికంగా ఉండడం, గాలి బలంగా వీచినప్పుడు పైరు నేలరాలడం, రైతు సాగు ఖర్చులు పెరగడం వంటి నష్టాలుంటాయని పేర్కొన్నారు. వ్యవసాయంలో రసాయనాలు వినియోగించడం, పంట చుట్టూ బంతిపూల నారు పెంచడం, పంట పద్ధతులలో పురుగుల ఉధృతిని తగ్గించడంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. సౌజన్య మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు రశీదులు తీసుకొని వాటిని జాగ్రత్తగా దాచుకోవాలని పేర్కొన్నారు. ఆ రశీదులతో ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం జరిగినప్పుడు బీమా పొందవచ్చని సూచించారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు రశీదులతో విక్రేత వద్ద ఫిర్యాదు చేయవచ్చు నని తెలిపారు. అదేవిధంగా ఈ పంట ఉత్పత్తులపై రసాయన అవశేషాల ప్రభావం గురించి తెలిపి సాగులో రసాయనాల వినియోగాలను తగ్గించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడం, ఫార్మర్ అధిక లాభాలను పొందవచ్చునని పేర్కొన్నారు. పర్యావరణంలో చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ చెట్లను నరకడం ఆపి మొక్కలు నాటడం, చెట్ల సంరక్షణ ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్, విస్తరణ అధికారి జె నవ్య, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- మామిడి రైతులకు రూ.లక్షల్లో నష్టం



నేలరాలిన మామిడి కాయలను కుప్పగా పోస్తున్న రైతు, కూలీలు

కమలాపూర్ : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలుల దాటికి కోతకొచ్చిన మామిడి కాయంతా నేలరాలిపోయింది. ఏప్రిల్ 15న రాత్రి ఒకసారి, మే 1న రాత్రి రెండోసారి, 4న రాత్రి మూడోసారి, ఇలా కేవలం 20 రోజుల వ్యవధిలో మూడుసార్లు బలమైన ఈదురు గాలులు వీయడంతో మామిడి చెట్టుపై కాయ అనేది లేకుండా పోయి పూర్తిగా నేలరాలింది. దీంతో మామిడి రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. అదేవిధంగా మండల వ్యాప్తంగా కోతకొచ్చిన వరిపంట సైతం నేలవాలడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మామిడి పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

పంటమార్పిడితో అధిక దిగుబడి

- ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి

పరకాల : పంట మార్పిడితో అధిక దిగుబడితో పాటు అనేక పంట ప్రయోజనాలు పొందవచ్చని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనల మేరకు రసాయనాలు వినియోగించాలని కోరారు. యూ రి యా వాడకం, సాగు ఖర్చులను తగ్గించడం, చెట్లను పెంచడం, సాగునీటిని ఆదా చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా రైతులు ఏదైనా విత్తనాలు, మందులు కొనుగో లు చేసినప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరకాల మండల వ్యవసా య శాఖ అధికారి శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డాక్టర్ బి. రాజు, డాక్టర్ కె.స్వాతి, వ్యవసాయ విస్తరనణ అధికారులు కోటం రాజు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే



పీచరలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను సోమవారం ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసి ఎమ్మెల్యేకు లిస్ట్ ఇవ్వగా ఎమ్మెల్యే ఫైనల్ చేసిన లిస్ట్ ప్రకారం లబ్ధిదారుల ఇంటికి అధికారులు వెళ్లి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు 5 వేల మందికి పైగానే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా శాలపల్లిలో 79 ఇళ్లు మంజూరు చేశారు. మిగతా గ్రామాలకు 210 ఇళ్లకు మొదటి విడతలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ఇలా..

వేలేరు గ్రామ పంచాయితీకి 50 ఇళ్ల మంజూరు కగా, పీచర 40, షోడాషపల్లి 30, మల్లికుదుర్ల 30, కమ్మరిపేట 30, గుండ్లసాగర్ 15, మద్దెలగూడెం 15 ఇళ్లు మంజూరయ్యాయి.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న అధికారిణి మధులిక

ఆత్మకూరు : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారిని మధులిక అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో సోమవారం రైతు దుద్దు నవీన్ ఆయిల్ పామ్ క్షేత్రంలో ఉద్యానవనశాఖ, రామ్‌చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ మొక్కల కొనుగోలు విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. నూతన దరఖాస్తులు తీసుకుంటామని అన్నారు. సబ్సిడీపై డ్రిప్, మొక్కలు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సన్నెబోయిన సాంబయ్య కుటుంబాన్ని సోమవారం పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భగా ధర్మారెడ్డి మా ట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ఆ యన వెంట బీ ఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, నాయకులు రవియాదవ్, రాజేశ్వర్‌రావు, వేణు, సాంబయ్య ఉన్నారు.



పరకాల : ప్రమీల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరామర్శ

పరకాల: అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొంపెల్లి విజేందర్‌రావు తల్లి ప్రమీల చిత్రపటానికి, మల్లక్‌పేటకు చెందిన బాబు రావు అనారోగ్యంతో మృతిచెందగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ సారంగపాణి ఉన్నారు.

‘ఆపరేషన్ కగార్’ను వెంటనే నిలిపివేయాలి



మాట్లాడుతున్న మాదాసి సురేశ్

ఆత్మకూరు : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేశ్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. కర్రె గుట్టల నుంచి పోలీసు బలగాలను వెనక్కి రప్పించాలని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు మిర్యాల కుమార్, పులిచేరు పైడి, అశోక్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



నర్సింహులగూడెంలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని నర్సింహులగూడెంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు చేప్పే అంశాలను రైతులు తప్పకుండా పాటించాలని రైతులకు సూచించారు. అసోసియేట్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించాలని, అవసరం మేరకు రసాయనాలు వినియోగించాలని, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అలాగే విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసిన రశీదులు రైతులు భద్రపరుచు కోవాలన్నారు. సాగునీటిని ఆదా చేసి భావితరలాలకు అందిచాలన్నారు. పంట మార్పిడి చేసుకోవాలన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం వారి సూచనలతో పంట మార్పిడితో అధిక దిగుబడి సాధించిన రైతులు దేవేందర్, భాస్కర్, వీరారెడ్డిలను ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. శాస్త్రవేత్తలు అశ్విని, డీఏఓ రవీందర్ సింగ్, ఉద్యానవన అధి కారి సుస్మిత, టెక్నికల్ అధికారి కమలాకర్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, ఏఓ సునీల్ కుమార్, నాయకులు గడ్డం సాయి, సమ్మెట మహేష్, పోలెపల్లి శంకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

- ఎఫ్ఎండీ మానిటరింగ్ అధికారి డాక్టర్ రజని



గుండేడులో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రజని

కమలాపూర్ : పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని స్టేట్ ఎఫ్ఎండీ మానిటరింగ్ అధికారి డాక్టర్ రజని సూచించారు. గుండేడు, కమలాపూర్ గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలు నిర్వహించి మొత్తం 232 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రజని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విజయభాస్కర్, ఏడీ డాక్టర్ నాగమణి, పశువైద్యాధికారులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ ప్లవన్ మజుందార్, గోపాలమిత్ర చక్రపాణి, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రోజూ రూ.307 కూలి ఇవ్వాలి

- ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న మేన శ్రీను

హసన్‌పర్తి : ఉపాధి కూలీకి ప్రతి రోజు రూ. 307 వేతనం వచ్చేలా పని కల్పించాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ మేన శ్రీను సూచించారు. హసన్‌పర్తి, ఐనవోలు, ఎల్కతుర్తి మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమీక్షా సమావేశం జరిగింది. హసన్‌పర్తిలోని సంస్కృతీ విహార్‌లో సోమవారం ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మేన శ్రీను ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామంలో 200 మందికి కూలీలకు పని కల్పించాలన్నారు. సీసీ రోడ్లు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల, మట్టి రోడ్లు, చేపల చెరువుల పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్‌కు సన్మానం

ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా హసన్‌పర్తికి వచ్చిన సందర్భంగా మేన శ్రీనుకు బొకే అందజేశారు. అదనపు పీడీ శ్రీనివాస్ ఎంపీడీఓలు కర్ణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, రఘుపతిరెడ్డి, ఏపీఓ విజయాలక్ష్మీ పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్
- వైద్యుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం

కమలాపూర్ : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో జరిగిన ఘటనకు సంబంధించి బాధ్యులైన వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉప్పల్‌కు చెందిన తిరుమల అనే గర్భిణీ ప్రసూతి కోసం ఆస్పత్రికి వస్తే ఆపరేషన్ చేసి కాటన్ ముక్క బయటకు తీయకుండా మర్చిపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రుల అభివృద్ధికి పెద్దపీట వేశామని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శించారు. రోగులకు సకాలంలో సరైన వైద్యం అందకపోవడం బాధాకరమన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ కిట్‌తో పాటు ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలు అందించామని గుర్తు చేశారు. బాధిత మహిళ తిరుమలకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

‘భూ భారతి’ ద్వారా సమస్యలకు పరిష్కారం

- జిల్లా భూభారతి స్పెషల్ ఆఫీసర్ మంగీలాల్



సమస్యలు తెలుసుకుంటున్న స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్

నడికూడ : భూభారతి ఆర్ఓఆర్ చట్టం ద్వారా రైతుల భూముల సంబంధించిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా భూభారతి స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సు సోమవారం మండలంలోని ధర్మారం, చౌటుపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేశారు. భూ సమస్యలపై చౌటుపర్తిలో 51, ధర్మారం 53 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

నేడు ముస్త్యాలపల్లి, సర్వాపూర్‌లో గ్రామ సభలు

భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నేడు (మంగళవారం) ముస్త్యాలపల్లి, సర్వాపూర్‌లో గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు సభకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరుకానున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

శాయంపేట : మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలోనే మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు బీఆర్‌ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నారాయణ రెడ్డి, శ్రావణ్‌కుమార్, మోహన్, రా జేందర్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివా స్ రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్, చంద్రమౌళి, పాల్గొన్నారు.